డబుల్.. ట్రబుల్!

సమస్యలతో సతమతమవుతున్న డబుల్‌బెడ్‌రూమ్ నివాసితులు

- 500 మంది కుటుంబాలు నివాసం
- తాగునీరు కూడా కరువే..
- వెలగని వీధి లైట్లు
- అపరిశుభ్రంగా పరిసరాలు
- పట్టించుకోని అధికారులు





డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయం

దుండిగల్: దుండిగల్ మున్సిపాలిటీ డి.పోచంపల్లిలో నాటి ప్రభుత్వం ఇక్కడ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించింది. రూ.140.13 కోట్లతో 15 బ్లాకుల్లో 1620 ఫ్లాట్లను నిర్మించగా.. 2023 సెప్టెంబర్ 2న నాటి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ప్రారంభించారు. ఇళ్లు ఉందన్న పేరుకే తప్ప నివసించడానికి వీలు లేకుండా సమస్యలతో నివాసితులు సతమతమవుతున్నారు. 1620 ఫ్లాట్లు నిర్మించినా ప్రస్తుతం ఇక్కడ దాదాపు 500 కుటుంబాలు మాత్రమే నివసిస్తున్నాయి.

> ప్రభుత్వాలు పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించినా వసతులు మాత్రం కల్పించడం లేదు. చాలీ చాలని నీళ్లు.. రాత్రుల్లో దోమల బెడద.. చీకటి పడితే చుట్టూ అంధకారం.. డబ్బులు పెట్టి మంచి నీటి కొనుగోలు.. పిల్లలు ఆడుకునేందుకు పార్క్ కరువు.. ఇది డి.పోచంపల్లిలోని డబుల్ బెడ్‌రూమ్ సముదాయంలో నివసిస్తున్న వారి దుస్థితి.. సొంత ఇళ్లు వచ్చిందన్న ఎన్నో ఆశలు, కలలతో అక్కడికి వచ్చిన లబ్ధిదారులు స్థానికంగా ఉన్న సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యలను చూసిన మరి కొందరు లబ్ధిదారులు ఇక్కడికి రావాలంటేనే జంకుతున్నారు.

ప్రధాన సమస్యలివే..

- మున్సిపల్ కార్యాలయం నుంచి ఇళ్ల సముదాయానికి వచ్చే మార్గంలో వీధి లైట్లు లేక రాత్రి సమయాల్లో పూర్తి అంధకారం నెలకొంటుంది. రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. కొన్ని సార్లు రాత్రి సమయాల్లో పాములు సైతం వస్తున్నాయని, విద్యుత్ దీపాలు లేకపోవడంతో ప్రమాదం పొంచి ఉందని స్థానికులు వాపోతున్నారు.
- మున్సిపల్ సిబ్బంది బ్లాకుల్లోని రోడ్లను ఊడ్చకపోవడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. దోమల బెడదతో నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు.
- నీటి సమస్య తీవ్రంగా ఉంది. వాడుకోవడానికి నీరు లేకపోవడంతో ప్రజాప్రతినిధుల సాయంతో మూడు బోర్లను నివాసితులు వేయించుకున్నారు. మొత్తం 15 బ్లాకులు ఉండటంతో నీరు సరిపోవడం లేదు. బ్లాక్‌కు ఒకటి చొప్పున బోర్లను వేస్తేనే నీటి ఎద్దడి తీరుతుంది.
- సముదాయం మధ్యలోనే ఒక మంచి నీటి ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. రూ.5 కే 20 లీటర్ల క్యాన్‌ను ఇస్తామని చెప్పారు. కానీ అది ఎప్పుడు మూసే ఉండడంతో రూ.20 లకు ప్రైవేటు వ్యక్తుల నుంచి లబ్ధిదారులు నీటిని కొనుగోలు చేస్తున్నారు.
- మధ్యలోనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు కనీసం కంచె కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో పిల్లలు విద్యుత్ ప్రమాదాల బారిన పడే అవకాశాలు ఉన్నాయి.
- డ్రైనేజీ నీరు బహిరంగ ప్రదేశాల్లో చేరకుండా సమీపంలోనే సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను నిర్మించారు. అయితే మురుగు నీరు శుద్ధి అయిన తరువాత ఆ నీరంతా సమీపంలోని జ్యోతిరావు పూలే స్టేడియం పక్కన ఉన్న అటవి ప్రాంతానికి చేరుతుంది. దీంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి.



తాగునీటిని కొనుగోలు చేస్తున్న నివాసితులు

గంట మాత్రమే నీటి సరఫరా



నీరు లేకపోవడంతో ఇక్కడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కేవలం గంట మాత్రమే నీళ్లు వస్తున్నాయి. లైట్లు లేకపోవడంతో రాత్రి సమయాల్లో భయం వేస్తుంది. దోమలు ఎక్కువగా ఉన్నాయి. మున్సిపల్ సిబ్బంది ఇక్కడ క్లీనింగ్ కూడా చేయడం లేదు. అధికారులు పట్టించుకుని సమస్యలను పరిష్కరించాలి.

– చాంద్ పాషా, స్థానికుడు

త్వరలో సమస్యలను పరిష్కరిస్తాం

ఇటీవల హౌసింగ్ అధికారులు డబుల్ బెడ్‌రూమ్ సముదాయం నిర్వహణ తమకు అప్పగించారు. లబ్ధిదారులు సొసైటీగా ఏర్పడితే అక్కడే ఉన్న షాపులకు టెండర్లు వేయవచ్చు. తద్వారా ప్రతి నెల వచ్చే అద్దెతో సమస్యలను పరిష్కరించవచ్చు. తమ సిబ్బందిని పంపించి పరిసరాలను శుభ్రం చేయిస్తాం. దోమల నివారణకు పిచికారీ చేయిస్తాం. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తాం.

– వెంకటేశ్వర్ నాయక్, కమిషనర్, దుండిగల్ మున్సిపాలిటీ



కంచె లేకుండా ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

మున్సిపల్ అధికారులకు అప్పగించాం

15 బ్లాకుల్లో 1620 ఫ్లాట్లను నిర్మించి మున్సిపల్ అధికారులకు అప్పగించాం. ఎస్‌టీపీలో మురుగు నీరు శుద్ధి అయిన తరువాతనే బయటకు వస్తుంది. మున్సిపల్ అధికారులు ఆ నీటిని మొక్కలకు ఉపయోగించుకోవచ్చు. ఒక్కో బ్లాక్‌కు ఆరు చొప్పున మొత్తం 90 దుకాణాలకు టెండర్లు వేసుకుంటే వాటి అద్దె ద్వారా మెయింటెనెన్స్ చేసుకునే అవకాశం ఉంటుంది. లబ్ధిదారులు సొసైటీగా ఏర్పడి సమస్యలను పరిష్కరించుకోవాలి.

– సుధాకర్‌గౌడ్, జీహెచ్ఎంసీ హౌసింగ్ ఏఈ

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చింతల్: విద్యుత్ మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు ఆయా సబ్ స్టేషన్ ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు బోయిన్‌పల్లి ఏడీఈ శ్రీకాంత్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రాగా టూల్స్ 33/11 కేవీ సబ్ స్టేషన్ ఎల్ అండ్ టీ ఫీడర్ పరిధిలో గాంధీనగర్, ఎల్ అండ్ టీ వేంకటేశ్వర స్కై టోస్, మధ్యాహ్నం 3 నుంచి 4:30 గంటల వరకు రాజ్ ఫుడ్స్ ఫీడర్ పరిధిలో గిరినగర్, శ్రీనివాస టవర్స్, హనుమాన్ టెంపుల్, విజయ్‌కృష్ణ అర్కేడ్, గురుమూర్తి నగర్, సౌభాగ్యనగర్, ఏపీహెచ్‌బీ కాలనీ, సుమిత్రనగర్, గుడెన్‌మెట్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏడీఈ కోరారు.

11న తైబజార్ వేలం

కుత్బుల్లాపూర్: కొంపల్లి మున్సిపల్ పరిధిలో తైబజార్ వేలం పాటను ఈ నెల 11న నిర్వహించనున్నట్లు కమిషనర్ కృష్ణారెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి తైబజార్ వేలం పాటలో పాల్గొనదలిచే వారు లక్ష ధరావత్తుతో పాటు లక్ష సాల్వెంసి సర్టిఫికేట్‌ను మున్సిపల్ కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుందన్నారు. తైబజార్ వేలంపాట అప్లికేషన్ల కోసం మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని కమిషనర్ సూచించారు.

రంజాన్ ఏర్పాట్లకు రూ.57 లక్షల నిధులు

జగద్గిరిగుట్ట: రంజాన్ సందర్భంగా గాజుల రామారం సర్కిల్‌లో ఈద్గాల ఏర్పాటు, మసీదుల వద్ద రోడ్ల మరమ్మతుల కోసం రూ.57 లక్షలతో పనులు ప్రారంభం కానున్నాయి. గాజులరామారం, జగద్గిరిగుట్టలో ఈద్గాల ఏర్పాటుకు రూ. 3.80 లక్షలు, చింతల్, సూరారంలో రూ. 3.35 లక్షలు, మసీదులకు వెళ్లే రోడ్ల మరమ్మతుల నిమిత్తం సుభాష్ చంద్రబోస్ నగర్‌లో రూ.11 లక్షలు, కైసర్ నగర్‌లోని మసీద్ ఎ రహమానియా వద్ద రూ.22 లక్షలు, దేవమ్మ బస్తీలో రూ.17 లక్షలతో పనులు చేయనున్నారు.

పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలి



పీస్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ రాములు

కుత్బుల్లాపూర్: రంజాన్ ప్రార్థనలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని పేట్ బషీరాబాద్ ఏసీపీ రాములు అన్నారు. శనివారం పేట్‌బషీరాబాద్ సీఐ విజయవర్ధన్ అధ్యక్షతన పీస్ కమిటీ మీటింగ్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మసీదుల వద్ద ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎవరైనా అనుమానితులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సమావేశంలో మసీద్ కమిటీల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఫుడ్‌ఫెస్ట్



వివిధ రకాల తినుబండారాలతో చిన్నారులు

జీడిమెట్ల: సుభాష్‌నగర్ డివిజన్ వెంకటాద్రినగర్‌లోని బోధివృక్ష ఒలంపియాడ్ స్కూల్‌లో ఫుడ్ ఫెస్ట్, రైతుబజార్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సుభాష్‌నగర్ కార్పొరేటర్ హేమలత సురేష్ రెడ్డి, సూరారం కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ హాజరయ్యారు. అనంతరం చిన్నారులు వడ్డించిన రకరకాల పదార్థాలను రుచి చూశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మహేందర్‌రెడ్డి, డైరెక్టర్లు భార్గవిరెడ్డి, వెంకటరెడ్డి, పద్మలతారెడ్డి, పోలీస్ భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్‌ను కలిసిన సంక్షేమ సంఘాల ప్రతినిధులు

కుత్బుల్లాపూర్: బంగారు తెలంగాణ సాధించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. శనివారం షాపూర్‌నగర్‌లోని ఆయన నివాసానికి నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీలు, బస్తీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు విచ్చేసి సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. వాటిపై స్పందించిన శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ.. అభివృద్ధి విషయంలో సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరు అయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

విద్యార్థులకు ఎగ్జామ్ కిట్టు అందజేత



జగద్గిరిగుట్ట: హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం సోమయ్యగర్‌లోని జడ్పీహెచ్ విద్యార్థులకు (సింగిల్ పేరెంట్ స్టూడెంట్) ఎగ్జామ్ కిట్‌లను పంపిణీ చేశారు. కిట్‌లో విద్యార్థులకు అవసరమైన ప్యాడ్, పెన్, పెన్సిల్, ఎరేజర్, వాటర్ బాటిల్, పర్సు ఉన్నాయి. కార్యక్రమంలో హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ అధ్యక్షులు తూటే విజయకుమార్, సయ్యద్ సాజిద్, సుభాష్ చంద్రా రెడ్డి, సాత్విక, రాయి విఘ్నేష్, డాక్టర్ సత్యనారాయణ, నగేష్ ప్రసాద్ మోహన్, ప్రేమ్ చందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్ఆర్ ఐటీలో ఘనంగా సంప్రదాయ దినోత్సవం



సంప్రదాయ దినోత్సవంలో పాల్గొన్న కళాశాల యాజమాన్యం, అధ్యాపక బృందం

దుండిగల్: దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల (ఎంఎల్ఆర్‌ఐటీ)లో శనివారం సంప్రదాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రంగవల్లులు, బతుకమ్మ ఉత్సవం, బోనాలు తదితర సంస్కృతీ సాంప్రదాయాలు ఉట్టిపడేలా పలు కార్యక్రమాలు రూపొందించి ఆహుతులను అలరించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు, కేమ్ క్లబ్ కో ఆర్డినేటర్ సందీప్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుల కోసం బరి గీసి కొట్లాడతా

ఎంపీ ఈటల రాజేందర్



సమావేశంలో మాట్లాడుతున్న మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

దుండిగల్: ఎద్దు ఏడిస్తే ఎవుసం.. రైతు ఏడిస్తే రాజ్యం బాగుపడదని, రైతుల జోలికి వస్తే ఊరుకునేది లేదని, ఎంతటి వారితోనైనా బరి గీసి కొట్లాడతానని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. దుండిగల్‌లోని వార్డు కార్యాలయం ఎదురుగా రైతులు నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. దుండిగల్‌లో గతంలో 490 ఎకరాలను రైతులకు అప్పటి ప్రభుత్వం అసైన్డ్ చేసిందన్నారు. 50 ఏళ్ల తరువాత ప్రస్తుతం సదరు స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం తిరిగి లాక్కోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణ సమయంలో పట్టా భూములు కోల్పోయిన రైతులతో పాటు అసైన్డ్ స్థలాలకు సైతం నష్టపరిహారం చెల్లించాలని మొట్ట మొదట కొట్లాడింది తానేనన్నారు. 12 సంవత్సరాల పాటు అసైన్డ్ స్థలంలో ఉంటే సదరు భూమి రైతుకే దక్కుతుందని రెవెన్యూ చట్టంలోనే ఉందన్నారు. భూమి రైతుకు భరోసా అని, నోటికాడి బుక్క లాక్కోవాలని కొందరు ప్రయత్నిస్తున్నారని, రైతులకు న్యాయం జరిగే వరకు ఉద్యమిస్తామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రికి లేఖలు రాస్తానని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఇన్‌చార్జి ఎస్.మల్లారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి డి విఘ్నేశ్వర్, మున్సిపాలిటీ అధ్యక్షుడు పీసరి కృష్ణారెడ్డి, మాజీ కౌన్సిలర్లు రాజిరెడ్డి, గోపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ కావలి గణేష్, నాయకులు బండారి మహేష్, విజయలక్ష్మి, ఆకుల మల్లేష్, ప్రభాకర్ రెడ్డి, భాను గౌడ్, శ్రీధర్ పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

సుభాష్‌నగర్: ఎస్పీఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గాజులరామారం చంద్రగిరి నగర్ చౌరస్తాలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం వరకు కొనసాగే ఈ శిబిరంలో ఆర్థోపెడిక్, గైనకాలజీ, జనరల్ మెడిసిన్ తదితర వైద్యులు అందుబాటులో ఉంటారని ట్రస్టు వ్యవస్థాపకుడు పున్నారెడ్డి పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆటో ఢీకొని గుర్తు తెలియని వ్యక్తికి తీవ్ర గాయాలు

దుండిగల్: ఆటో ఢీ కొట్టడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి 9 గంటల సమయంలో భౌరంపేట్ స్నేక్ పార్క్ మార్గంలో నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని ఆటో ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన సదరు వ్యక్తిని సూరారం మల్లారెడ్డి ఆసుపత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉండటంతో నగరంలోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. అతని వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదని, సంబంధీకులు ఎవరైనా ఉంటే దుండిగల్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కమ్యూనిటీహాల్ ఏర్పాటుకు సహకరించాలి



కొలన్ హన్మంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టు కాలనీ వాసులు

నిజాంపేట్: నిజాంపేట్ జర్నలిస్టు కాలనీలో కమ్యూనిటీహాల్ ఏర్పాటుకు సహకరించాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి హన్మంత్‌రెడ్డిని కాలనీ వాసులు కోరారు. శనివారం ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. 2007లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలైన జర్నలిస్టులకు ఇందిరమ్మ పథకం కింద స్థలాలను కేటాయించిందన్నారు. నివాస స్థలాలను ఇచ్చిన ప్రభుత్వం సామాజిక అవసరాల నిమిత్తం స్థలాన్ని కేటాయించలేదని గుర్తు చేశారు. జర్నలిస్టు కాలనీ వాసుల అభ్యర్థన మేరకు అధికారులను సంప్రదించి కాలనీ వాసులకు కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు కృషి చేస్తానని హన్మంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జర్నలిస్టు కాలనీ ఫౌండర్ అధ్యక్షులు ఆస్కాని మారుతి సాగర్, అధ్యక్షుడు తన్నీరు శ్రీనివాస్, ఎం.దేవేందర్, ఎం.జీతయ్య, ఏ.గోవిందరావు, పి.శ్రీనివాసరావు, కె.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మాదిగ అమరులకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు

కుత్బుల్లాపూర్: అమరవీరుల ప్రాణ త్యాగాలు వృథా కాలేవని, ఎస్సీ వర్గీకరణ సాధించుకున్నామని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు రాసమల్ల యాదగిరి అన్నారు. ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో శనివారం చింతల్ మున్సిపల్ సర్కిల్‌లో మాదిగ అమరవీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అమరుల చిత్రపటాలకు పూలమాలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఏ బీ సీ డీ గా వర్గీకరణ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి సిలువేరు శ్రీనివాస్, దళిత సంఘాల ఐక్య కార్యాచరణ చైర్మన్ బూదాల విజయభాస్కరరావు, ఇసురం రమేష్, మట్ట నర్సింహులు, మాల మాదిగ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు ఎస్ సలోని, ఆటో బలరాం, కె కురుమయ్య, భూమయ్య సాగర్, విజయ్ కుమార్ మాదిగ, డప్పు రామస్వామి, తొండ వెంకట్, గణేష్, నరేష్ పాల్గొన్నారు.

భాగ్యరథిలో ఘనంగా ఫెస్ట్- 2025



విద్యార్థులకు మెమోంటో అందజేస్తున్న కళాశాల యాజమాన్యం

రంగారెడ్డినగర్: భాగ్యరథి డిగ్రీ కళాశాలలో ఫెస్ట్–2025ని శనివారం గాంధీనగర్‌లోని ఎస్.ఆర్. ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగింది. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కళాశాల అధినేత వెంకట్‌రెడ్డి, డైరెక్టర్లు రామకృష్ణ, రమేశ్‌బాబు, నల్ల జైశంకర్‌గౌడ్, ప్రిన్సిపాల్ గోవింద్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. సీబీసీఎస్ గ్రేడింగ్‌లో 10/10 మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహం అందిస్తామని, విజేతలుగా నిలిచిన విద్యార్థి తల్లిదండ్రులతో కలిసి దేశంలోని ఏ ప్రాంతానికైనా వెళ్లేందుకు మూడు విమాన టికెట్లను అందిస్తామన్నారు. ఏప్రిల్, మే నెలల్లో జరిగే సెమిస్టర్ 2, 4, 6 లలో విద్యార్థులు ప్రతిభ కనబరిచి కళాశాలకు మంచి గుర్తింపు తేవాలన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమోంటోలు, సర్టిఫికెట్లను అందజేశారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శనలు

కుత్బుల్లాపూర్: వైజ్ఞానిక ప్రదర్శనలు భావి శాస్త్రవేత్తలు తయారయ్యేందుకు ఉపకరిస్తాయని శ్రీచైతన్య కొంపల్లి జోన్ ఏజీఎం రమణారావు అన్నారు. శనివారం కొంపల్లి శ్రీచైతన్య కళాశాలలో జరిగిన సైన్స్ ఎక్స్‌పోలో విద్యార్థులు శరీర అవయవాల పనితీరును ప్రయోగాత్మకంగా చూపించారు. అదే విధంగా రక్త నమూనాలను సేకరించి బ్లడ్‌గ్రూప్, డయాబెటీస్ పరీక్షల ఫలితాలను తెలియజేశారు. కార్యక్రమంలో జోనల్ కో ఆర్డినేటర్ రవి, ఆర్‌ఐ చక్రి, ప్రిన్సిపాళ్లు భావన, హేమలత, డీన్ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

వివేకానంద్ విద్యా మందిర్‌లో..

సుభాష్‌నగర్‌లోని వివేకానంద విద్యా మందిర్ హైస్కూల్‌లో నిర్వహించిన సైన్స్ ఫెయిర్ ఆకట్టుకుంది. శాస్త్ర సాంకేతికతతో పాటు దైనందిన జీవితంలో మానవుడికి ఉపయోగపడే పలు నమూనాలను రూపొందించి విద్యార్థులు అబ్బురపరిచారు. కార్యక్రమంలో రికగ్నైజేషన్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ కుత్బుల్లాపూర్ మండల్ చైర్మన్ శివయ్య, వైస్ చైర్మన్ మండవ శ్రీనివాస్‌గౌడ్, పాఠశాల కరెస్పాండెంట్ సునీత, వైస్ ప్రిన్సిపాల్ లత పాల్గొన్నారు.



శ్రీచైతన్య స్కూల్‌లో మెడికల్ క్యాంప్



వివేకానంద విద్యామందిర్‌లో..

మసీదుల వద్ద వసతులను మెరుగుపరుస్తాం

జీఆర్ఎస్ శాసనసభ విప్, ఎమ్మెల్యే వివేకానంద్



భారత రాజ్యాంగ పరిరక్షణ దినోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్ తదితరులు

కుత్బుల్లాపూర్: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని నియోజకవర్గంలోని మసీదుల వద్ద వసతులను మెరుగు పరిచేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. శనివారం పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులు, ప్రజాప్రతినిధులతో రంజాన్ ఏర్పాట్లపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మసీదుల వద్ద ప్రార్థనలు చేసేందుకు వచ్చే వారికి తాగునీటి వసతి కల్పించాలని, అదేవిధంగా ఎప్పటికప్పుడు పారిశుద్ధ్యాన్ని నిర్వహించడంతో పాటు వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. నెల రోజుల పాటు మసీదుల వద్ద ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చూడాల్సిన బాధ్యత అన్ని విభాగాల అధికారులపై ఉందన్నారు. ఏమైనా పనులు మిగిలి ఉంటే యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. సమీక్షా సమావేశంలో కార్పొరేటర్లు జగన్, సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి, జంట సర్కిళ్ల ఉప కమిషనర్లు మల్లారెడ్డి, నరసింహ, ఈఈలు కిష్టప్ప, లక్ష్మీ గణేష్, వివిధ విభాగాల అధికారులు, ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యతని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. భారత రాజ్యాంగ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సూరారం డివిజన్ సాయిబాబానగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లో జై భీమ్ మహాసేన ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ద్వారానే నేడు స్వతంత్ర భారతావనిలో ప్రతి ఒక్కరూ తమ హక్కులను సాధించుకోగలుగుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రావుల శేషగిరి, మాజీ కౌన్సిలర్ కిషన్‌రావు, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పుప్పాల భాస్కర్, టీఆర్ఎస్ఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి యాదగిరి, జై భీమ్ మహాసేన రాష్ట్ర అధ్యక్షుడు గట్టు అశోక్, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, మహాసేన సభ్యులు జేమ్స్, అమర్ బాబు, సిద్ధయ్య, సత్యనారాయణ, ఐలయ్య గౌడ్, మన్నె నత్తయ్య, బాలస్వామి, యేసు రత్నం తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్ర పాలిమర్స్‌లో వేతన ఒప్పందం

జీడిమెట్ల పారిశ్రామిక వాడలోని ఆంధ్ర పాలిమర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో శనివారం నూతన వేతన ఒప్పందం జరిగింది. సమావేశానికి యూనియన్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే వివేకానంద్ హాజరై పరిశ్రమ యాజమాన్యంతో వేతన ఒప్పందాన్ని కుదిర్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల వేతనాన్ని రూ.5,800 నుంచి రూ.7,600 లకు పెంచడం జరిగిందని, అదే విధంగా కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చేందుకు పరిశ్రమ యాజమాన్యం అంగీకరించిందన్నారు. కార్యక్రమంలో కంపెనీ హెచ్ఆర్ సురేష్ బాబు, ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రసూల్, ఉపాధ్యక్షుడు రమేష్, సంయుక్త కార్యదర్శి రవి కిరణ్, కార్మికులు పాల్గొన్నారు.